సాక్షి అనంతపురం

సోమవారం । 18 । నవంబర్ । 2024



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.12, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



మట్టి కొండలు మాయం

టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. మట్టికొండలను కొల్లగొడుతున్నారు. అక్రమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగిస్తున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
32.2°/20.4°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

1 నుంచి పీఏబీఆర్ కుడి కాలువకు నీరు



అనంతపురం సెంట్రల్: పీఏబీఆర్ కుడి కాలువకు డిసెంబర్ 1వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ వినోద్‌కుమార్ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో తాగు నీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయనున్నట్లు వివరించారు. 33 చెరువులు నింపుతామని, దీంతో భూగర్భ జలాలు వృద్ధి చెంది ఇబ్బందులు తలెత్తవన్నారు.

రైతులకు మరింత సహకారం అందించాలి

- సహకార వారోత్సవాల్లో జేసీ శివనారాయణశర్మ



సహకార పతాకావిష్కరణలో జేసీ శివనారాయణశర్మ, తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: కాలానుగుణంగా సహకార రంగంలో మార్పులు చేస్తూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలలో భాగంగా ఆదివారం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జ్ హోదాలో ఆయన పాల్గొని సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 'వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర' నినాదంతో 'సహకార సంస్థలు... వ్యాపార ప్రాయోజిత సంస్థలుగా రూపాంతరం' అంశంపై ఏర్పాటు చేసిన చర్చాగోష్టిలో జేసీ మాట్లాడారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని, గిట్టుబాటు ధరలు దక్కేలా మార్కెటింగ్ వ్యవస్థ ద్వారా ప్రోత్సహించాలన్నారు. తద్వారా డీసీఎంఎస్ ఆర్థికంగా బలోపేతమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఇ.అరుణకుమారి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ టి.విజయభాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్స్ మేనేజర్ సుధాకరరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్, సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు, విద్యాధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ, జేకేసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు గుంతకల్లులోని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ నాగరాజు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ, మెడ్ ప్లస్, టాటా ఎలక్ట్రాన్, కేఎల్ గ్రూప్, హావెల్స్, బిగ్ బాస్కెట్, డైకిన్(ఏసీ), ఐఐఎఫ్ఎల్, క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ్, జరీకర్త్, హీల్ మై ఫ్యామిలీ హెల్త్ కేర్ కంపెనీల్లో ఉద్యోగాలకు అర్హులైన వారిని ఆయా కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేయనున్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు తమ విద్యార్హత, ఆధార్‌కార్డు, బయోడేటాను వెంట తీసుకెళ్లాలి.

ఘనంగా రథోత్సవం



ఉద్దేహాళ్‌లో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బొమ్మనహాళ్: మండలంలోని వివిధ గ్రామాల్లో గజగౌరీ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట, కృష్ణాపురం, లింగదహాళ్, దేవగిరి క్రాస్, నేమకల్లు, గోనేహాళ్ తదితర గ్రామాల్లో గజగౌరీదేవి ఉత్సవ మూర్తిని ఆదివారం తెల్లవారుజాము నుంచి ఊరేగించారు. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు, బంధువులు భారీగా తరలిరావడంతో గ్రామాలు జనసంద్రమయ్యాయి. కోలాటం, చెక్క భజనలతో ఆకట్టుకున్నారు. అనంతరం గజగౌరీదేవి జలధితో ఉత్సవాలు ముగించారు.



- జిల్లాలో పెరిగిన గంజాయి వినియోగం
- ఒడిశా నుంచి జిల్లాకు అక్రమంగా సరుకు
- చిన్న,చిన్న ప్యాకెట్లలో అమ్మకాలు
- సింహభాగం గంజాయి విక్రేతలు మైనర్లే
- కేసుల నుంచి తప్పించుకునేందుకు నీచ సంస్కృతికి తెరలేపిన ముఠా
- మత్తుకు అలవాటై చిత్తవుతున్న యువత
- మైకంలో దొంగతనాలు, మహిళలు, విద్యార్థినులకు వేధింపులు

గంజాయ్..

- తాడిపత్రి పట్టణంలోని కృష్ణాపురం ఐదో రోడ్డులో వారం రోజుల క్రితం గంజాయి సేవించిన యువకులు హల్‌చల్ చేశారు. బైకులపై తిరుగుతూ కాలనీ వాసులను భయభ్రాంతులకు గురిచేశారు. ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడి ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు అక్కడికి చేరుకునేలోపు గంజాయి బ్యాచ్ పారిపోయింది.
- 11 మంది గంజాయి విక్రేతలను అనంతపురం పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. ఏకంగా 20 కిలోల సరుకు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి విశాఖపట్నం మీదుగా నగరానికి తీసుకొచ్చినట్లు గుర్తించారు. చిన్న చిన్న ప్యాకెట్లలో నింపి అనంతపురం నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో యువతకు అమ్ముతున్నట్లు వెల్లడైంది.

అనంతపురం: జిల్లాపై గంజాయి పంజా విసురుతోంది. గంజాయికి బానిసలైన యువకులు మత్తులో యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతున్నారు. పోలీసుల నిఘా కొరవడడంతో వీరి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా కొందరు గంజాయి తాగుతూ చెలరేగిపోతున్నారు. ప్రధాన కూడళ్లలో సైతం హల్‌చల్ చేస్తున్నారు.

నగరంలో విచ్చలవిడిగా..

అనంతపురం నగరంలో విచ్చలవిడిగా గంజాయి లభ్యమవుతోంది. కొన్ని చోట్ల టీ కేఫ్‌లలో యువత గంజాయి సేవిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. కేజీ రూ.10 వేల చొప్పున కొనుగోలు చేసిన అనంతరం చిన్న, చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కొక్కటి రూ.200 నుంచి రూ.300 చొప్పున విక్రయాలు సాగిస్తున్నారు. సిగరెట్లలోని పొగాకును పాక్షికంగా తీసేసి అందులో గంజాయి పెట్టి పొగ పీల్చుతున్నారు. అనంతపురం సమీపంలో ఆకుతోటపల్లి నుంచి కందుకూరు మార్గంలో ఎస్కేయూ గెస్ట్ హౌస్ దాటిన వెంటనే ఓ పాడుబడిన బావి వద్ద నిత్యం గంజాయి బ్యాచ్ ఉంటున్నట్లు తెలిసింది. అక్కడే ఉండి కళాశాలకు వెళ్లే విద్యార్థులకు అలవాటు చేస్తున్నట్లు సమాచారం.

మైనర్ల ద్వారా విక్రయాలు..

ఇటీవల అనంతపురం కలెక్టరేట్ సమీపంలోని గోశాల వద్ద గంజాయి అమ్ముతూ ఓ మైనర్ పట్టుబడ్డాడు. మైనర్లను విక్రేతలుగా నియమించుకుంటే చట్టపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తవనే ఉద్దేశంతో గంజాయి ముఠా ఇలాంటి నీచసంస్కృతికి తెరలేపినట్లు తెలిసింది. దీంతో గంజాయి ముఠాను ఎలా కట్టడి చేయాలో పోలీసులకే అంతు చిక్కడం లేదు.

అవగాహనపై దృష్టి సారించని యంత్రాంగం

గంజాయి క్రయ విక్రయాలు, అక్రమ రవాణాకు సంబంధించి ఫిర్యాదులు, డీ- అడిక్షన్ కేంద్రాల సేవలకు టోల్‌ఫ్రీ నంబర్ -14446కు డయల్ చేయాలి. అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో డీ-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇలాంటి విషయాలపై ఎన్‌జీఓలు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కళాకారుల సహకారంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



టీడీపీ నాయకుడు వన్నూరుస్వామి మామిడితోటలో పెంచుతున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)



ఇటీవల 11 మందితో కూడిన ముఠాను అరెస్ట్ చేసి స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు (ఫైల్)

బతుకు చిత్తు..

యువత బతుకులను గంజాయి చిత్తు చేస్తోంది. గంజాయికి అలవాటు పడ్డ యువకులు సమయానికి సరుకు దొరక్కపోతే పంక్చర్లు వేసే సొల్యూషన్, జిరాక్స్ షాపుల్లో వాడే ఎరైజర్స్, వైటనర్‌లు పీల్చుతూ మత్తులో జోగుతున్నారు. అర్ధరాత్రి సమయాల్లో దుకాణాలు పగులగొడుతున్నారు. అడ్డొస్తే దాడులకు తెగబడుతున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు తీసుకున్న యువకులే జిల్లాలో ఎక్కువగా చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

ఉక్కుపాదం మోపుతాం..



గంజాయి విక్రేతలపై ఉక్కుపాదం మోపుతాం. గంజాయి అమ్మేవారు, కొనేవారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ ద్వారా విక్రేతల కదలికలను పసిగడుతున్నాం. నేరాలకు పాల్పడే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరు.

– పి. జగదీష్, జిల్లా ఎస్పీ

'తమ్ముళ్ల' కక్కుర్తి..



గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న టీడీపీ నాయకుల ముఠాను అరెస్టు చేసిన పామిడి పోలీసులు (ఫైల్)


కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రెచ్చిపోతున్న 'తెలుగు తమ్ముళ్లు' గంజాయి సాగు, విక్రయాలకూ సిద్ధమైపోయారు. మామిడి తోటలో గంజాయి మొక్కలు పెంచుతున్న రాయదుర్గం మండలం టీ.వీరాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చిలకరి వన్నూరుస్వామిని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేయడమే ఇందుకు నిదర్శనం. నిందితుడు వన్నూరుస్వామి నియోజకవర్గ ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడు కావడం గమనార్హం.

- గంజాయి విక్రయాల్లో ఆరితేరిన పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తమ్మినేని శివకుమార్, తమ్మినేని నందకుమార్‌తో పాటు వీరి అనుచరులు ఇద్దరిని ఈ ఏడాది ఆగస్టు 7న పామిడి పోలీసులు అరెస్టు చేశారు. 9.210 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం నుంచి అక్రమంగా తీసుకొచ్చి అనంతపురం, గుంతకల్లు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. స్వయాన అన్నదమ్ములైన శివకుమార్, నందకుమార్ గంజాయి అమ్మకాలతో భారీగా వెనకేసుకున్నట్లు వెల్లడైంది. అధికార అండతో దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలు, అక్రమ మద్యం అమ్మకాలతో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు నేడు గంజాయి విక్రయాలకూ దిగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పామిడి పోలీసులు పట్టుకున్న వాహనాలు (ఫైల్)

నేటి నుంచి సత్యసాయి జయంత్యుత్సవాలు



సత్యసాయి బాబా



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

- వేణుగోపాలస్వామి రథోత్సవంతో ప్రారంభం కానున్న వేడుకలు
- 19న మహిళా దినోత్సవం, 22న డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం
- 23న బాబా జయంతి వేడుక
- హాజరు కానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- భక్తుల కోసం మహానారాయణ సేవకు ఏర్పాట్లు చేసిన ట్రస్టు

ప్రశాంతి నిలయం: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ప్రశాంతినిలయంలో వారం రోజులు ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరియనుంది. ఇప్పటికే సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. దేశ, విదేశాల నుంచి సత్యసాయి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. వేడుకలకు వేదిక అయిన సాయి కుల్వంత్ సభా మందిరం, సత్యసాయి మహాసమాధిని ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు. సోమవారం వేణుగోపాలస్వామి రథోత్సవంతో వేడుకలు ప్రారంభమవుతాయి. 19న మహిళా దినోత్సవం, 20, 21 తేదీల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, 22న సత్యసాయి డీమ్డ్ టు బి యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవం నిర్వహించనున్నారు. స్నాతకోత్సవానికి యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సందేశమివ్వనున్నారు. ఈ సందర్భంగా సత్యసాయి విద్యాసంస్థల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేయనున్నారు. 23వ తేదీ సత్యసాయి 99వ జయంతి వేడుకలను మహాసమాధి చెంత ఘనంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై సందేశం ఇవ్వనున్నారు. సత్యసాయి భక్తులు తయారు చేసిన 99 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టనున్నారు. వేడుకలలో భాగంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వార్షిక బడ్జెట్ నివేదిక విడుదల చేయనున్నారు. అదేవిధంగా సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు సంబంధించిన క్యాలెండర్ ఆవిష్కరించనున్నారు. 24న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఏడాదిలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో డిగ్రీ స్థాయి వరకు సత్యసాయి బోధనలు, మానవతా విలువలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ ప్రదానం చేయనున్నారు.

నేటి నుంచి మహా నారాయణ సేవ

జయంత్యుత్సవాలకు హాజరవుతున్న భక్తులకు అన్న ప్రసాద వితరణ కోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సోమవారం నుంచి ప్రశాంతి నిలయంలోని నార్త్ బిల్డింగ్స్ వెనుక ఉన్న మైదానంలో మహానారాయణ సేవ నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆదివారం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు ప్రత్యేక పూజలు చేసి ఫుడ్ కోర్టు ప్రారంభించారు. పురుషులకు 11 కౌంటర్లు, స్త్రీలకు 11 కౌంటర్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా రోజూ సుమారు 50 వేల మందికి అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన మూడు వేల మంది సేవాదళ్ సభ్యులు ఇప్పటికే ప్రశాంతి నిలయం చేరుకున్నారు. వీరందరూ ప్రశాంతి నిలయంలో జరిగే ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో సేవలందించనున్నారు.

అంతర్జాతీయ వైద్య శిబిరం

సత్యసాయి జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రశాంతి నిలయం నార్త్ బిల్డింగ్స్ వద్ద సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వైద్య నిపుణులతో వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 18 నుంచి 24 వరకు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సేవలందిస్తారు. అన్ని వైద్య విభాగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, రోగ నిర్ధారణను బట్టి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు.

వేడుకలను విజయవంతం చేయండి

ప్రశాంతి నిలయంలో ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ రాజు పిలుపునిచ్చారు. భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నేటి నుంచి మహా నారాయణ సేవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

బ్యాడిగికి బ్యాడ్ 'టైం'

కూడేరు మండల పరిధిలోని ముద్దలాపురంలో సుమారు 1,000 ఎకరాల్లో బ్యాడిగి మిర్చి పంటను రైతులు సాగు చేశారు. ఇటీవల చెట్ల నుంచి మిర్చిని తొలగించి పొలాల్లో నిల్వ ఉంచుకున్నారు. మార్కెట్లో ప్రస్తుతం బ్యాడిగి మిర్చి క్వింటా రూ.15 వేల నుంచి 20 వేల వరకు ధర పలుకుతోంది. దిగుబడి బాగానే ఉండటం, రేట్లు కూడా పలుకుతుండటంతో మంచి లాభాలు వస్తాయని రైతులు భావించారు. అయితే, మూడు రోజుల నుంచి కురుస్తున్న వానకు మిర్చి తడిసి పోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కాయ దెబ్బతింటే కొనుగోలుదారులు ముందుకు రారని, వచ్చినా తక్కువ ధరకు అడుగుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – కూడేరు:



ముద్దలాపురంలో వర్షానికి తడిసిన బ్యాడిగి మిర్చిని పొలంలో ఆరబెట్టిన దృశ్యం

డబ్బు కొట్టు.. డిప్యుటేషన్ పట్టు

- ఆరోగ్యశాఖలో అడ్డగోలు బాగోతం
- ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్లు
- ముడుపులు తీసుకుని కథ నడిపిస్తున్నారని విమర్శలు



అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో ఆరోగ్య శాఖలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందించాల్సిన సిబ్బంది జిల్లా కేంద్రంలో తిష్ట వేయడం చర్చనీయాంశమవుతోంది. ఆరోగ్య శాఖలోని ఓ కీలక అధికారి కనుసన్నల్లోనే అడ్డగోలు బాగోతానికి తెరలేచినట్లు తెలుస్తోంది.

ఆర్‌డీ విచారణలో తేటతెల్లం..

డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించాలంటే ఉన్నతాధికారుల అనుమతి ఉండాలి. కానీ ఆరోగ్యశాఖలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఏకంగా 20 మందికిపైగా ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఉంటున్నారు. అందులో శ్రీధరఘట్ట పీహెచ్‌సీ నుంచి ఓ సూపర్‌వైజర్, బ్రహ్మసముద్రం పీహెచ్‌సీ నుంచి సూపర్‌వైజర్, పెద్దవడుగూరు పీహెచ్‌సీకి చెందిన పీహెచ్ఎన్, పుట్లూరు పీహెచ్‌సీ ఏఎన్ఎం, డీఐఓ సెక్షన్‌లో విధులు నిర్వర్తించే ఉద్యోగి, పీ కొట్టాలపల్లి పీహెచ్‌సీ నుంచి హెల్త్ ఎడ్యుకేటర్, బత్తలపల్లి నుంచి హెల్త్ ఎడ్యుకేటర్, కిష్టపాడు పీహెచ్‌సీఓ నుంచి హెల్త్ ఎడ్యుకేటర్, రాకెట్ల పీహెచ్‌సీ నుంచి ఓ హెల్త్ ఎడ్యుకేటర్, పుట్లూరు పీహెచ్‌సీ నుంచి ఎంపీహెచ్ఏలు, నార్పల పీహెచ్‌సీ నుంచి ఓ సీనియర్ అసిస్టెంట్, నాగలాపురం పీహెచ్‌సీ నుంచి ఓ ఎంపీహెచ్ఎస్, గుత్తి సబ్ యూనిట్ నుంచి ఓ ఎంపీహెచ్ఎస్, కురుగుంట పీహెచ్‌సీ నుంచి ఓ ఎంపీహెచ్ఏ, తరిమెల పీహెచ్‌సీ నుంచి ఓ ఫార్మసిస్టు, కురుగుంట నుంచి ఓ ఫార్మసిస్టు జిల్లా కేంద్రంలో తిష్ట వేశారు. ఈ విషయం బయటకు పొక్కడంతో ఇటీవల కడప ఆర్‌డీ విచారణ చేయగా.. మౌఖిక ఆదేశాలతో అనధికారికంగా జిల్లా కేంద్రంలో పని చేస్తున్నట్లు తేలిందని సమాచారం. దీంతో అప్రమత్తమైన సదరు అధికారి అందులో కొందరిని వారి పీహెచ్‌సీలకు పంపేసినా, చాలా మంది ఇప్పటికీ జిల్లా కార్యాలయంలో పని చేస్తున్నట్లు తెలిసింది.

రూ.లక్షల్లో ముడుపులు..

ఆరోగ్యశాఖలో తిష్ట వేసిన సిబ్బంది ఓ కీలక అధికారికి రూ.లక్షల్లో ముడుపులు సమర్పించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతోనే సిబ్బందిని తిరిగి వారి సొంత స్థానాలకు పంపలేని పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. ఫార్మసిస్టులు, హెల్త్ ఎడ్యుకేటర్లు, సీనియర్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, తదితర సిబ్బంది జిల్లాకేంద్రంలో ఉండటంతో క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది. ఈ విషయంపై కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఒక్కరిని కూడా డిప్యుటేషన్ వేయలేదు



ఆరోగ్యశాఖలో ఒక్కరికి కూడా డిప్యుటేషన్ వేయలేదు. సిఫార్సులను సైతం పక్కన పెట్టాం. పలు అసోసియేషన్ల నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో డిప్యుటేషన్‌పై ఎవరూ పని చేయడం లేదు. కొన్ని ఖాళీ పోస్టులకు సంబంధించి వారానికి రెండు రోజుల పాటు పలు పీహెచ్‌సీల నుంచి వచ్చి విధులు నిర్వర్తించి వెళ్తున్నారు.

– డాక్టర్ భ్రమరాంబ దేవి, డీఎంహెచ్ఓ

ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు

- జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గుత్తి/తాడిపత్రి అర్బన్: పదేపదే ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామితో కలసి గుత్తి, తాడిపత్రిలోని ఎక్సైజ్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. అంతకు ముందు తాడిపత్రిలోని కల్లు దుకాణాలను తనిఖీ చేసి నమూనాలను సేకరించారు. అనంతరం ఆయా స్టేషన్లలో పలు రికార్డులు పరిశీలించారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడుతూ.. కర్ణాటక మద్యం తరలింపులు, నాటు సారా తయారీ... రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్ణీత ధరకే మద్యం విక్రయాలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు జి.నాయుడు, గురునాథరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



తాడిపత్రిలోని కల్లు దుకాణంలో నమూనాలు సేకరిస్తున్న ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

క్లుప్తంగా

తపాలా ఉద్యోగి అదృశ్యం


రామాంజనేయులు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక తపాలా శాఖలో పోస్ట్‌మెన్‌గా పనిచేస్తున్న రామాంజనేయులు శనివారం ఉదయం నుంచి కనిపించడం లేదు. కళ్యాణదుర్గంలోని పార్వతీనగర్‌లో నివాసముంటున్న ఆయనకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలం క్రితం భార్య మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.

కనిపించని కేజీబీవీ విద్యార్థిని

యాడికి: అపార్ నమోదు ప్రక్రియలో భాగంగా ఆధార్ అప్‌డేట్ కోసం ఇంటికి వచ్చిన కేజీబీవీ విద్యార్థిని కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి గ్రామానికి చెందిన నారాయణస్వామి, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె నవిత... యల్లనూరులోని కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. అపార్ నమోదు ప్రక్రియలో భాగంగా ఆధార్ కార్డులో మార్పులు చేయించుకునేందుకు ఈ నెల 3న ఇంటికి వచ్చిన నవి.... శనివారం తిరిగి ప్రయాణమైంది. అయితే ఆమె కళాశాలకు చేరలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం తల్లిదండ్రులు గాలించినా ఫలితం దక్కలేదు. శనివారం రాత్రి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నీట మునిగి విద్యార్థినులకు అస్వస్థత

గుమ్మఘట్ట: ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. వివరాలు... గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామానికి చెందిన హరిజన హనుమంతు, శ్రుతి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పెద్ద కుమార్తె సంగీత 8వ తరగతి, రెండో కుమార్తె పవిత్ర ఆరో తరగతి చదువుతున్నారు. ఆదివారం దుస్తులు ఉతికేందుకు గ్రామ సమీపంలోని వేదవతి హగరి నది వద్దకు తల్లితో పాటు కుమార్తెలూ వెళ్లారు. ఆ సమయంలో తల్లి దుస్తులు ఉతుకుంటే నీటిలో ఆడుకుంటూ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో ఇద్దరూ మునిగిపోయారు. ప్రమాదాన్ని గుర్తించిన తల్లి వెంటనే కేకలు వేయడంతో అక్కడికి సమీపంలోనే ఉన్న పశువుల కాపరులు వెంటనే బాలికలను వెలికి తీసి, రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


ఆంజనేయులు (ఫైల్)

శింగనమల: బుక్కరాయసముద్రం మండలం పొడరాళ్ల గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు(29) విద్యుత్ షాక్‌తో ఆదివారం రాత్రి 8 గంటలకు మృతి చెందాడు. తనకున్న రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టిన ఆయన... పంటకు నీరు పెట్టేందుకు బోరు మోటార్ ఆన్ చేసేందుకు స్టాటర్ పెట్టెను తీస్తుండగా షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. ఎంత సేపటికీ ఇంటి పెద్ద ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు తోట వద్దకెళ్లి పరిశీలించారు. ఆంజనేయులు మృతదేహాన్ని చూసి భార్య, కుమార్తె, కుమారుడు బోరున విలపించారుర. ఘటనపై బీకేఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మట్టి కొండలు మాయం!

- సరిహద్దులో మాఫియాను తలపిస్తున్న మట్టి వ్యాపారం
- రాయదుర్గం చుట్టుపక్కల కొండల్లో యథేచ్ఛగా మట్టి దోపిడీ
- మడేనహళ్లి, ఓబుళాపురం నుంచి టన్నుల కొద్దీ గ్రావెల్ తరలింపు


మడేనహళ్లి- లింగమ్మనహళ్లి మధ్య మట్టి తవ్వకాలతో తరిగిపోతున్న గుట్ట

రాయదుర్గం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రాయదుర్గం నియోజకవర్గ పరిధిలో మట్టి కొండలు మాయమవుతున్నాయి. కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. చూస్తుండగానే కొండలు, గుట్టలు కనుమరుగవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందే తడువుగా ఉపాధి క్షేత్రసహాయకులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, ఎఫ్‌పీ షాప్ డీలర్ షిప్పులు, పాఠశాలల్లోని పారిశుధ్య కార్మికులు, ఐకేపీ యానిమేటర్లను తొలగించి, అక్రమంగా వాటిని దక్కించుకున్న టీడీపీ నేతలు... తాజాగా ప్రకృతి సంపద దోపిడీపై దృష్టి సారించారు. టీడీపీ నేతలు సాగిస్తున్న మట్టి అక్రమ దందాపై రాయదుర్గం ప్రాంతానికి చెందిన బీఎస్పీ నేత నేరుగా సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేయడం గమనార్హం.

రోజూ ఆదాయమే...

నియోజకవర్గ పరిధిలోని మట్టి కొండలు టీడీపీ నేతలకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. జేసీబీలు, హిటాచీలు ఏర్పాటు చేసి టన్నుల కొద్దీ మట్టిని తవ్వి రోజూ టిప్పర్లు, లారీల్లో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రోజూ రూ.లక్షల్లోనే ఆదాయాన్ని గడిస్తున్నారు. రాయదుర్గంలోని భంభంస్వామి ఆలయం సమీపంలో చర్చి పక్కన గుట్టలో భారీగా గ్రావెల్ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. మట్టి కోసం టిప్పర్లు క్యూ కడుతున్నాయి. నాలుగైదు రోజులుగా తవ్వకాలు ఊపందుకున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు పొలాల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే ముందుగా మైనింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరి అంటూ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు. అయితే ఇందుకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగిస్తుండడం గమనార్హం. అలాగే రాయదుర్గం – బళ్లారి మార్గంలోని మల్లాపురం లేఔట్ సమీపంలో నాలుగు రోజుల క్రితం రాత్రి వేళ కొండల్లో భారీగా మట్టి తవ్వకాలు చేపట్టారు. టిప్పర్ల ద్వారా స్థానిక ప్రధాన రహదారిలోని ఓ ఫంక్షన్ హాలు వద్దకు మట్టిని తరలించినట్లు తెలుస్తోంది.


భంభంస్వామి ఆలయ సమీపంలోని గుట్టలో మట్టి తవ్వకాలు

అనుమతులు తప్పనిసరి

ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టరాదు. ఇప్పటికే డి హీరేహాళ్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి పలు వాహనాలు సీజ్ చేయించాం. రాయదుర్గంలో మట్టి తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, మైనింగ్ శాఖ డీడీ

డి.హీరేహాళ్‌లో బరి తెగింపు

బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారి పనులు ఊపందుకున్న తర్వాత డి.హీరేహాళ్ మండలంలో భారీగా వెంచర్లు వెలిశాయి. దీనికి తోడు కోల్డ్ స్టోరేజీలు, కర్మాగారాలు, ఇతర పరిశ్రమలు పుట్టుకొస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఇనుప ఖనిజం సులువుగా లభిస్తుంది కానీ, మట్టి దొరకడం చాలా కష్టం. ఈ అవసరాన్ని టీడీపీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. డి.హీరేహాళ్ మండలం మడేనహళ్లి, లింగమ్మనహళ్లి, ఓబుళాపురం, పులకుర్తి క్రషర్ ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపట్టి బళ్లారికి తరలించి ఒక్కో టిప్పర్ లోడుకు రూ.10వేల నుంచి రూ.12 వేలకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గుగ్గిరెట్టి ప్రాంతంలో ఓ కోల్డ్‌స్టోరేజీలోకి వెయ్యి ట్రిప్పుల మట్టి ఆర్డర్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో అక్కడికి పగలు, రాత్రి మట్టిని తరలించి రోజు వారీ సొమ్ము దండుకుంటున్నారు. ఇటీవల ఓబుళాపురం సమీపంలో సర్వే నంబర్ 372–3 లో 5.23 ఎకరాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ అక్రమాలపై బాధిత రైతులు స్థానిక తహసీల్దార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే అక్టోబర్ 29న మైన్స్ అండ్ జియాలజీ అధికారులు డి.హీరేహాళ్ మండలంలో పర్యటించి, మట్టి తవ్వకాలపై తనిఖీలు చేపట్టారు. లింగమనహళ్లిలో మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

చిన్నారులకు స్క్రీనింగ్

- చిన్నారుల్లో న్యుమోనియా లక్షణాలు గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే


పసికందులకు స్క్రీనింగ్ చేస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

అనంతపురం మెడికల్: ప్రాణాంతక న్యుమోనియా వ్యాధి బారిన చిన్నారులు పడకుండా సాన్స్ పేరుతో జిల్లా వైద్యఆరోగ్యశాఖ స్క్రీనింగ్ టెస్టులు చేపడుతోంది. ఈ నెల 12న మొదలైన ఈ కార్యాచరణ వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ పలు దశల్లో కొనసాగనుంది. జిల్లాలో 0–5 ఏళ్లలోపు ఉన్న 2,10,000 మందికి స్క్రీనింగ్ చేయనున్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్ పర్యవేక్షణలో జిల్లాలోని 45 పీహెచ్‌సీలు, 25 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటినీ సందర్శించి సర్వే కొనసాగిస్తున్నారు. దగ్గు, జ్వరం, త్వరత్వరగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకునే సమయంలో పక్కటెముకలు కదలడం, ఏమీ తినకపోవడం, తాగకపోవడం, దద, అధిక బద్ధకం, నిద్ర మత్తు తదితర లక్షణాలతో బాధపడుతున్న పసికందుల్లో జ్వరం, బరువు, శ్వాస, ఆక్సిజన్ స్థాయిలను పరిశీలిస్తున్నారు. వీటి ఫలితాల ఆధారంగా సాధారణ లక్షణాలుంటే అందుబాటులో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రానికి, తీవ్రమైన లక్షణాలుంటే జిల్లా ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. కాగా, న్యుమోనియా బారిన చిన్నారులు పడకుండా ఉండేందుకు బిడ్డ శరీరాన్ని బట్టలతో పూర్తిగా కప్పి ఉంచాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ సూచిస్తున్నారు.

'లోకాయుక్త' తరలింపు సరికాదు


మాట్లాడుతున్న కేవీ రమణ

- అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ

అనంతపురం టవర్‌క్లాక్: అమరావతి అభివృద్ధి పేరుతో కర్నూలు నుంచి హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్తను తరలించడం పూర్తిగా రాయలసీమ వ్యతిరేక చర్య అని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కేవీ రమణ మండిపడ్డారు. హెచ్ఆర్‌సీ, లోకాయుక్త తరలింపుపై ఆదివారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మేధావులు, వివిధ పార్టీల నాయకులు మాట్లాడారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం వాటా దక్కకుండా ఇప్పటికే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధి అంటే కేవలం ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కాదన్నారు. రాయలసీమలో ఇప్పటికే ఏర్పాటు చేసిన లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీని అమరావతికి తరలించుకుపోవడం దారుణమన్నారు. రాయలసీమలో హంద్రీ–నీవా, గాలేరు, నగరి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్తను అమరావతికి మార్చకుండా నిలుపుదల చేయకపోతే రాయలసీమ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దాదాగాంధీ, శ్రీనివాసరెడ్డి, నాగలింగయ్య, బాల రంగయ్య, రామాంజినేయులు, ఎస్‌ఎం బాషా, నాగన్న, సోమశేఖరరెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డి, గంటల నారాయణ రెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి కిష్టప్ప, భాగ్యలక్ష్మీరెడ్డి, సత్యనారాయణరెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక.. భర్త హత్య

కళ్యాణదుర్గం రూరల్: వేధింపులు తాళలేక క్షణికావేశంలో భర్తనే హతమార్చిన భార్య ఉదంతం సంచలనం రేకెత్తించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం పీటీఆర్‌పల్లి తండాకు చెందిన గీతాబాయి, పశ్చిమ బెంగాల్‌కు చెందిన విజయ్ సర్దార్ (40) పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న విజయ్ సర్దార్ తరచూ ఆమెను వేధింపులకు గురి చేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం వారి ఇంటి సమీపంలో నిలిపి ఉంచిన మరో వ్యక్తి ద్విచక్ర వాహనానికి విజయ్ సర్దార్ నిప్పు పెట్టాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విజయ్ సర్దార్‌ను పిలిపించి మందలించి పంపారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న విజయ్‌సర్దార్... భార్యపై అనుమానంతో దుర్భాషలాడుతుంటే ఆమె అడ్డుకుంది. తనపై లేని పోని అనుమానాలు వీడాలని నచ్చచెప్పేందుకు ప్రయత్నించింది. అయినా విజయ్‌సర్దార్ తీరులో మార్పు రాలేదు. దీంతో క్షణికావేశానికి లోనైన ఆమె తాడుతో భర్త గొంతును బలంగా బిగించడంతో ఊపిరి ఆడక విజయ్ సర్దార్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ వంశీకృష్ణ... సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బకాయిలు చెల్లించకపోతే పోరుబాటే

- ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖరరెడ్డి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధానకార్యదర్శి కులశేఖరరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలు, మొండి బకాయిల చెల్లింపులపై ఎన్నిమార్లు విన్నవించినా కూటమి ప్రభుత్వం స్పందించడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే పోరుబాట తప్పదని ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర పూర్వ ప్రధానకార్యదర్శి కులశేఖరరెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. కులశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డితో పాటు ప్రధానకార్యదర్శి శ్రీనివాసనాయక్ మాట్లాడారు. 12వ పీఆర్సీకి సంబంధించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 117 జీఓ రద్దు చేయాలన్నారు. అనంతరం డిమాండ్ల సాధనకు డిసెంబరు 16, 17 తేదీల్లో, జనవరిలో రాష్ట్రస్థాయి పోరాటాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల స్టాఫ్ ప్యాట్రన్‌లపై మండలాల నుంచి అభిప్రాయాలు సేకరించి జిల్లా శాఖకు పంపాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్‌రఫీ, జిల్లా గౌరవాధ్యక్షుడు వరప్రసాద్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, నాయకులు రవీంద్ర, ఆంజనేయులునాయక్, అశోక్‌నాయక్, వజీర్‌బాషా, రామాంజనేయులు, నరసింహులు, ఫకృద్దీన్ పాల్గొన్నారు.

చిరకాల ప్రత్యర్థిపై అనూహ్య విజయం


గెలుపొందిన తమిళనాడు జట్టు

అనంతపురం: దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ అనంత క్రీడాగ్రామం వేదికగా హోరాహోరీగా సాగుతోంది. ఆదివారం కర్ణాటక, తమిళనాడు జట్ల మధ్య మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ఆఖరి నిమిషం వరకూ నువ్వా.. నేనా అనే రీతిలో ఇరు జట్ల క్రీడాకారులు తలపడ్డారు. చివరి నిమిషంలో తమిళనాడు జట్టు గోల్ చేసి తన చిరకాల ప్రత్యర్థి కర్ణాటక జట్టుపై విజయం సాధించింది. పదేళ్ల తర్వాత తొలిసారిగా కర్ణాటకపై విజయం సాగించడంతో తమిళనాడు క్రీడాకారులు కేరింతలు కొట్టారు. ఈ ఇరు జట్లలోనూ సింహభాగం క్రీడాకారులు అంతర్జాతీయ జట్టులో ప్రాతినిధ్యం వహించే జట్టులో ఉన్నవారే కావడం గమనార్హం. మ్యాచ్ సగం అయ్యే సరికి చెరో గోల్‌తో సమానంగా నిలిచినా... రెండో భాగంలో తమిళనాడు జట్టు చివరి నిమిషంలో మెరుపులాంటి గోల్‌తో విజయాన్ని సొంతం చేసుకుంది.

ఖాతా తెరవని ఆంధ్ర..

ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్– అండమాన్ జట్లలో మధ్య జరిగిన మ్యాచ్‌లో అండమాన్ జట్టు విజయం సాధించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆంధ్రప్రదేశ్ జట్టు చివరి వరకూ పోరాడిన ఫలితం దక్కలేదు. అండమాన్ నికోబార్ జట్టు క్రీడాకారుడు జితిన్ రజ్ అనూహ్యంగా గోల్ కొట్టి జట్టును విజయతీరాలకు చేర్చాడు. తొలి మ్యాచ్‌లో కర్ణాటక చేతిలో ఓటమి పాలైన ఆంధ్ర జట్టు... రెండో మ్యాచ్‌లోనూ అండమాన్ నికోబార్ జట్టు చేతిలో పరాజయం పాలైంది. ఆర్డీఓ కేశవనాయుడు, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డేనియల్ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

పందుల అపహరణ

పెద్దపప్పూరు: పెంపకందారుడి కాళ్లు చేతులు కట్టేసి పందులను అపహరించుకెళ్లిన ఘటన పెద్దపప్పూరులో సంచలనం రేకెత్తించింది. వివరాలు... స్థానిక తహసీల్దార్ పాత కార్యాలయం సమీపంలో నివాసముంటున్న పిచ్చిగుంట్ల మహేష్, మల్లేష్... రామకోటి కాలనీ సమీపంలోని పెన్నానది ఒడ్డున పందుల పెంపకం చేపట్టారు. ఆదివారం వేకువజాము 2 గంటల సమయంలో దాదాపు 10 మంది దుండగులు అక్కడకు చేరుకుని నిద్రిస్తున్న మహేష్ కాళ్లు, చేతులు కట్టేసి, చితకొట్టారు. అనంతరం అరవకుండా నోటిలో గుడ్డలు కుక్కి 40 పందులను బొలెరో వాహనంలో వేసుకుని ఉడాయించారు. ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు మహేష్‌ను విడిపించారు. కాగా, పందులను అపహరించడం ఇది నాల్గోసారిగా బాధితులు తెలిపారు. తాజా ఘటనను పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

వలస కార్మికుడి అనుమానాస్పద మృతి


మృతుడు దిలీప్ సాకేత్

గుత్తి రూరల్: బతుకు తెరువు కోసం వలస వచ్చిన ఓ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మధ్రప్రదేశ్‌లోని సత్నా జిల్లా, అమర్పతన్ తహసీల్, పారస్‌వహి గ్రామానికి చెందిన దిలీప్ సాకేత్ (19) బతుకు తెరువు కోసం వలస వచ్చి పెద్దవడుగూరు మండలం వెంకటాంపల్లి గ్రామ సమీపంలోని శివకృష్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి గుత్తి మండలంలో కొత్తపేట గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కనే ఉన్న హోటల్‌లో మద్యం సేవించి భోజనం ముగించుకుని తోటి కూలీలతో కలిసి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతూ కింద పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కూలీలు మద్యం మత్తులో ఉన్నాడనుకుని వారి క్యాంపు వద్ద ఉన్న బొలెరో వాహనాన్ని రప్పించి తీసుకెళ్లి పడుకోబెట్టారు. ఆదివారం ఉదయం 9 గంట వుతున్నా నిద్ర లేవకపోవడంతో అనుమానంతో తోటి కూలీలు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే దిలీప్ మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, కల్తీ మద్యం సేవించి మృతి చెందినట్లుగా అనుమానాలు వ్యక్తం కావడం గమనార్హం. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

అ'పూర్వ' సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

రాయదుర్గం టౌన్: దాదాపు పాతికేళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులతో రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సందడి నెలకొంది. 1995–97లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ బ్యాచ్, 1997–2000లో కేటీఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన 110 మంది మంది ఒక్కటిగా కలసి నాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగులుగా రాణిస్తున్న కొందరితో పాటు వాణిజ్య రంగంలో స్థిరపడిన మరికొందరిని, చేతివృత్తులతో జీవనం సాగిస్తున్న ఇంకొందరిని ఒకేవేదికపై తీసుకురావడంలో పూర్వ విద్యార్థులు నజీర్, రఘునాథరెడ్డి, మంజునాథ, బాబు, సునీత, లావణ్య, కళావతి తీవ్రంగా శ్రమించారు. అప్పటి అధ్యాపకులు కోటేశ్వరరావు, రమణ, చంద్రయ్య, భీమిరెడ్డిను ఘనంగా సత్కరించారు.

ఆధ్యాత్మిక శోభితం


జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న ప్రధాన అర్చకుడు రాము


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: కార్తీక దీప కాంతులతో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. పండితుల వేదమంత్రాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆదివారం నిర్వహించిన కోటి దీపోత్సవ కార్యక్రమానికి గతంలో ఎన్నడూ లేనంత భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. నిమ్మ దొప్పులు, మట్టి ప్రమిద దీపాల వెలుగులో ఆలయం బంగారు వర్ణాన్ని సంతరించుకుంది. అంతకు ముందు ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మంజునాథ స్వామి, పార్వతీ దేవికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి జ్వాలా తోరణం వెలిగించి కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొని పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా రాత్రి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాబు, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎల్‌డీఓ సుజన జయంతి, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఈఓఆర్డీ కామాక్షి, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.


కార్తీక దీపాలు వెలిగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

రోగులకు ఉత్తమ సేవలందించండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం కార్పొరేషన్: నూతన విధానాలు, ఆవిష్కరణలతో రోగులకు నాణ్యమైన వైద్యం అందించవచ్చు. సదస్సుల ద్వారా మరింత కొత్త విషయాలు తెలుస్తాయని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో కిమ్స్ సవీరా ఆస్పత్రి ఆధ్వర్యంలో లంగ్ టాక్స్ అనే సదస్సు నిర్వహించారు. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్‌స్టిషియల్ లంగ్ డిసీజ్ (ఐఎల్‌డీ), క్షయ(టీబీ), ఊపిరితిత్తుల కేన్సర్లు తదితర సమస్యలు ఎందుకు వస్తాయి? వాటి నిర్ధారణకు ఎలాంటి పరీక్షలు చేయించుకోవాలి తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యతో నూతన ఆవిష్కరణలు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు

అనంతపురం మెడికల్: నిరంతర వైద్య విద్యతో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు అభిప్రాయడ్డారు. ఆదివారం ప్రభుత్వ వైద్య కళాశాలలోని పెథాలజీ విభాగంలో చర్మ వ్యాధి శాస్త్ర సమగ్ర విశ్లేషణపై నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నిరంతర వైద్య విద్య ద్వారా కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. రోగులకు అందించే సేవల్లో నాణ్యత లభిస్తుందన్నారు. విశ్వభారతి మెడికల్ కాలేజ్ పెథాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ మైరెడ్డి నీరజ, సెయింట్ జాన్స్ మెడికల్ కాలేజ్ చర్మ వ్యాధి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ ఏఎస్ రామస్వామి, శాంతిరామ్ వైద్య కళాశాల పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ జానకి వైద్య రంగంలో వస్తున్న నూతన విధానాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో అనంతపురం వైద్య కళాశాల పెథాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శివశంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ టీచర్ మృతి



సురేష్ నాయుడు (ఫైల్)

కనగానపల్లి: నెలన్నర రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంట్రాక్టు టీచర్ సురేష్ నాయుడు (32) ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కనగానపల్లికి చెందిన సురేష్ నాయుడు స్థానిక మోడల్ స్కూల్‌లో కంప్యూటర్ టీచర్‌గా కాంట్రాక్టు కింద పని చేస్తున్నాడు. సెప్టెంబర్ 29వ తేదీన అనంతపురం నుంచి కనగానపల్లికి ద్విచక్ర వాహనంలో వస్తూ మామిళ్లపల్లి వద్ద రోడ్డు ప్రమాదానికి గురనాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని తొలుత చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అనంతరం బెంగుళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. కాని ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య శోభారాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తెలుగు సాహిత్యాన్ని మరవకూడదు



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న రచయిత దాసిరెడ్డి

కనగానపల్లి: పర భాషలు ఎన్ని నేర్చుకున్నా తెలుగు భాషా సాహిత్యాన్ని మరవకూడదని పలువురు రచయితలు, ఉపాధ్యాయులు తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. స్థానిక రచయితలు దాసిరెడ్డి, తిప్పయ్య, పుల్లన్న తదితరులు తెలుగు భాషా, సంస్కృతి, సాహిత్యాన్ని కవితల రూపంలో విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష ఎంతో గొప్పదని.. బతుకుదెరువు కోసం పర భాషలు నేర్చుకోవాలని సూచించారు. అయితే మాతృభాషను ఎప్పుడూ మరవకూడదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గోవిందు, గ్రామస్తులు నాగభూషణ. మురళీ, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం

- వర్షాలకు గుంతలమయమైన రహదారులు
- ప్రజలకు ప్రత్యక్ష నరకం
- తరచుగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

రాప్తాడు: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలమయమై అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులు అభివృద్ధి చేస్తామని చెప్పిన కూటమి నేతలు.. అధికారం చేపట్టి నాలుగు నెలలు పూర్తి కావస్తున్నా రోడ్ల నిర్మాణంపై శ్రద్ధ చూపడం లేదు. ఎన్నికలకు ముందు అది చేస్తాం.. ఇది చేస్తామంటూ ఊదరగొట్టిన కూటమి.. తీరా అధికారంలోకి వచ్చాక హామీల అమలులో విఫలమైంది. రోడ్లకు తట్టెడు మట్టి వేసి మరమ్మతులు చేసిన పాపాన పోలేదని మండల ప్రజలు మండిపడుతున్నారు.



పండమేరు బ్రిడ్జి వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రయాణికులకు ప్రాణ సంకటం..



పాలచెర్ల నుంచి బోగినేపల్లికి వెళ్లే రోడ్డు దుస్థితి..

మరూరు నుంచి చాపట్ల వరకు వెళ్లే మట్టి రోడ్డుపై గోతులు ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. ప్రస్తుతం టీడీపీ నాయకులు ఆ రోడ్డు వేసేందుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైతుల పొలాల్లో గుంతలు తీసి మన్ను రోడ్డుకు వేశారు. మండలంలో గుట్టలు ఎక్కువగా ఉన్నా, గుట్టల మన్నును ఇలాంటి రోడ్లకు తోలకుండా వెంచర్లకు తోలుతూ అమ్ముకుంటున్నారు. రోడ్డుకు తమ పొలాల్లోనే గుంతలు తీసి రోడ్డుకు వేశారని.. గుంతలోకి ఎవరైనా అదుపుతప్పి పడితే మృతి చెందుతారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పండమేరు వంక దాటుకునేందుకు వరిమడుగు వద్ద, పాలచెర్ల రోడ్డులోని చెక్ డ్యాంల వద్ద రోడ్లు అద్వానంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా కొట్టుకుని పోయింది.

రోడ్లు నిర్మించరా?

అల్పపీడనం ప్రభావంతో ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా పలు గ్రామాల రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్లపై నీరు చేరడంతో మెయిన్ రోడ్లు, మట్టి రోడ్లు అనేక ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి. గంగలకుంట, హంపాపురం, మరూరు నుంచి ఎం.బండమీదపల్లి రోడ్డు, రామినేపల్లి నుంచి ఎం.బండమీదపల్లి రోడ్డు, బుక్కచెర్ల నుంచి గాండ్లపర్తి రోడ్లపై పలు ప్రాంతాల్లో వర్షాలకు గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ద్విచక్ర వాహనాదారులకు గుంతల రోడ్లు చుక్కలు చూపిస్తున్నాయి. ఆదమరిస్తే గోతుల్లో పడి గాయాల పాలవడమో లేక ప్రాణాలు పోవడం ఖాయం. కళ్ల ముందు పెద్ద గుంతలతో రోడ్లు కనిపిస్తున్నా అధికారులు మాత్రం కనీసం స్పందించడం లేదు. నాయక్ నగర్ నుంచి అయ్యవారిపల్లి వరకూ 8 కిలోమీటర్ల రోడ్డులో భారీగా గుంతలు పడ్డాయి. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే వాహనాలతో కుస్తీ పట్టాల్సిందే.

ఎన్నికల కోడ్‌తో ఆగిన పనులు

పాలచెర్ల నుంచి భోగినేపల్లి వరకూ 3 కిలోమీటర్ల రోడ్డు వేయడానికి గత ప్రభుత్వంలో తారు తొలగించారు. రోడ్డు వేసే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. కంకర మాత్రమే వేయడంతో రోడ్డుపై ప్రయాణించాలంటే కంకర, మరో పక్క గుంతలు ఏర్పడటంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాప్తాడు నుంచి జేఎన్‌టీయూకు వెళ్లే రోడ్డులో అడుగుకో గొయ్యి పడింది. అనంతపురం వెళ్లే ప్రయాణికులు, జేఎన్‌టీయూ ఉద్యోగులు ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గంగలకుంటకు వెళ్లే రోడ్డు దగ్గర మలుపులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కందుకూరు క్రాస్ రోడ్డులో కూడా మట్టి రోడ్డు అద్వానంగా తయారైంది. రాత్రి సమయాల్లో గోతులు కనిపించ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నరకం చూస్తున్నాం



మండల కేంద్రానికి పని మీద వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. మా గ్రామం నుంచి మరూరు గ్రామం వరకూ దాదాపుగా 6 కిలోమీటర్లు రోడ్డు లేదు. రోడ్డుపై వెళ్లాలంటే భయమేస్తుంది. ఎక్కడ చూసినా గుంతలు దర్శనమిస్తున్నాయి. అనారోగ్యానికి గురైనప్పుడు ఈ రూట్లో ఆస్పత్రులకు వెళ్లాలంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో కుదరదు. వర్షాకాలంలో మరీ ఘోరంగా ఉంటుంది. మా గ్రామానికి 108, 104 వాహనాలే రావు. నరకం చూస్తున్నాం.

– లక్ష్మీనారాయణ, పాలబావి, రాప్తాడు మండలం

ప్రమాదకరంగా గుంతలు



గత ప్రభుత్వంలో రోడ్డు వేయడానికి పాలచెర్ల వరకు 3 కిలో మీటర్లు కంకర తోలారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్డు వేయిస్తామని చెప్పారు. నాలుగు నెలలు దాటినా రోడ్డు వేయలేదు. మండల కేంద్రానికి వెళ్లాలంటే మరిమగుడు గ్రామం మీదుగా వెళ్లాలి. వరిమడుగు గ్రామం దాకా 7 కిలోమీటర్లు మట్టి రోడ్డు ఉంది. రోడ్డుపై పెద్ద గోతులు పడటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ గుంతల్లో పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు.

– భాస్కర్ రెడ్డి, భోగినేపల్లి

కనకదాస జయంతికి పకడ్బందీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ఉప సంచాలకులు మల్లికార్జున

అనంతపురం రూరల్: కనకదాస రాష్ట్ర స్థాయి జయంత్యుత్సవంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ ఉప సంచాలకులు మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఆదివారం సభ జరిగే పంక్షన్ హాల్‌ను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి కార్యక్రమం కావడంతో అన్ని జిల్లాల నుంచి ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలన్నారు. వీఐపీలు వచ్చి వెళ్లే ప్రదేశంలో నిఘా ఉంచాలన్నారు. తాగునీటి, విద్యుత్ సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో పని చేస్తే కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

‘నిరుద్యోగ భృతి’ అమలు చేయరా?



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు

అనంతపురం అర్బన్: యువశక్తి దేశానికి దిక్సూచి అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వారి శక్తి, సేవలను దేశానికి ఉపయోగించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేయలేదని విమర్శించారు. ఆదివారం స్థానిక నవయుగ కాలనీలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి అధ్యతన కార్యక్రమం నిర్వహించారు. లెనిన్ బాబుతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ముఖ్య అతిథిగా హాజరై ఏఐవైఎఫ్ స్తూపం, జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. యువతకు సరైన ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే వారి భవిష్యత్తు సవ్యదిశలో ముందుకు వెళుతుందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి భారత రాజ్యాంగ హక్కులన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరించడంలో విఫలం అయ్యాయన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారానే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు నిర్ణయాత్మకంగా పని చేయడం లేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చాన్నారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఏడు సార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించినా.. నిరుద్యోగ సమస్యపై చర్చించలేదన్నారు. నిరుద్యోగ భృతిపై విధివిధానాలు ప్రకటించకపోవడం శోచనీయన్నారు. ఆంక్షలు లేకుండా యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వశాఖల్లోని ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేసి, వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, ఏఐవైఎఫ్ నాయకులు రాజు, శ్రీనివాస్, మోహన్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల ఆలోచనలు అర్థం చేసుకోవాలి



పుస్తకాన్ని పరిచయం చేస్తున్న సీనియర్ సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: ఆధునిక కథా సాహిత్యంలో రచయిత్రి ప్రగతి ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆమె కథలు జీవిత సౌందర్యం, సంఘర్షణకు అద్దం పడతాయని వేమన విశ్వవిద్యాలయం ఆచార్యురాలు వినోదిని అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో సీనియర్ రచయిత్రి డాక్టర్ ప్రగతి రచించిన కొన్ని చీకట్లు.. ఓ వెలుతురూ కథా సంపుటి పరిచయ సభ జరిగింది. రాజారాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆచార్య వినోదినితో పాటూ సమన్వయకర్తలుగా వ్యవహరించిన డాక్టర్ అంకె శ్రీనివాస్, డాక్టర్ హెచ్ పల్లవి తదితరులు మాట్లాడారు. ఆడపిల్లల ఆలోచనలు, అలజడులను సహానుభూతితో అర్థం చేసుకున్నప్పుడే ఆధునికత సాధ్యపడుతుందన్నారు. ఇందుకు ప్రగతి కథలు దోహదపడతాయన్నారు. జీవితంలోని సున్నితత్వం, సమాజంలో వెలుగు చూడని కోణాలను మన ముందుకు తీసుకురావడంలో ప్రగతి విజయవంతం అయ్యారన్నారు. అదేవిధంగా సంపుటిలోని కథలపై జరిగిన చర్చలో రచయిత్రులు చిలుకూరి దీవెన, యమునారాణి, శేషగిరి రాయుడు, శోభామణి, హేమమాలిని, చం.శాస్త్రి, డాక్టర్ వెంకటనారాయణ తదితరులు చక్కగా విశ్లేషించారు.

విద్యారంగ సమస్యలపై పోరాడతాం



ఎన్నికైన ఏఐఎస్‌ఎఫ్ మహిళా విభాగం నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) బాలికల విభాగం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంత రాయుడు అధ్యక్షతన బాలికల విభాగం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ బాలికల విభాగం జిల్లా కన్వీనర్‌గా రాధాజ్యోతి, కో-కన్వీనర్లుగా సాయి స్వరూప, శృతి, సభ్యులుగా వెన్నెల, అను, మంజుల, రోజా, రమ్యశ్రీ, చందన, మమత, త్రివేణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాధాజ్యోతి, సాయిస్వరూప, శృతి మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై జిల్లా వ్యాప్తంగా విద్యార్థినులను ఏకంగా చేసి ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. దేశం, రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతున్నా అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అర్ధరాత్రి కాదుకదా పట్టపగలు మహిళలు బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. కఠినశిక్షలు అమలు చేస్తే ఇలాంటి ఘటనలు పునరావృతం కావన్నారు. ఇందుకోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నాయకులు చందు, మంజు,ఉమామహేష్, తారక్ పాల్గొన్నారు.

కంది రైతులకు వర్షం దెబ్బ



అత్మకూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు కంది రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కంది పూత దశలో ఉన్నప్పుడు మేఘాలు కమ్ముకున్నా.. వర్షాలు వచ్చినా.. తంపర్లు పడినా పూత రాలిపోయి పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉంది. ఇలాంటి వాతావరణంలో కంది పూత రాలకుండా ఉండేందుకు ఏ మందులు వాడాలో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందిలో ఆకుపచ్చ పురుగు నివారణకు 1.6 మి.లీ మైనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ క్వినాల్ఫాస్, 2.5 మి.లీ, క్లోరోపైరిఫాస్ మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వ బెదిరింపులకు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పెదవడుగూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. మండలంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. టీడీపీ నాయకులు, తదితరులు ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా భయపడాల్సిన పనిలేదన్నారు. చట్టబద్ధంగా ముందుకెళ్దామని సూచించారు. వీలైతే అధికారుల వద్దకు వచ్చి మాట్లాడుతానన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి పార్టీ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. పోలీసుల నుంచి ఏమైనా ఒత్తిళ్లు ఉన్నా.. ఉన్నతాధికారులతో మాట్లాడుతామన్నారు. ఎంత ఇబ్బంది వచ్చినా ధైర్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

చిన్నారులకు బాల కళారత్న అవార్డులు



ప్రశంసాపత్రాలను చూపుతున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: చిన్నారుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి చిల్డ్రన్స్ ఒలంపియాడ్, సాయి మంజీరా నృత్యనికేతన్ వారు ఇటీవల మూడు రోజుల పాటూ నిర్వహించిన నృత్యపోటీల్లో అనంత చిన్నారులు ప్రతిభ కనబరిచారు. గుంటూరులోని బృందావనం అన్నమయ్య కళాక్షేత్రం వేదికగా నిర్వహించిన పోటీల్లో నగరానికి చెందిన నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్ శిష్యులు సీనియర్ విభాగంలో లాలిత్య, చందన, జూనియర్ విభాగంలో రిషికశ్రీ, మహతి, మనోజ్ఞ, సబ్ జూనియర్ విభాగంలో మయూకశ్రీ, వైడూర్య, ఓజస్విని తదితరులు తమ నృత్యప్రతిభతో బాలకళారత్న అవార్డులు అందుకున్నారు. ప్రఖ్యాత శాస్త్రీయ నృత్యగురువు డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, నిర్వాహకులు మస్తానయ్య, జింకా రామయ్య చేతుల మీదుగా చిన్నారులు పురస్కారాలతో పాటూ సత్కారం అందుకున్నారు.

అలరించిన ఆ పాత మధురాలు



పురస్కారాలు అందుకున్న గాయనీమణులు

అనంతపురం కల్చరల్: గత ఐదు దశాబ్దాలుగా అనంతలో సంగీత సేవలందిస్తున్న ఘంటసాల ఆరాధన సమితి వారు తొలిసారి సినీగాయనీమణుల పేరిట పురస్కారాలు అందించారు. ఆదివారం స్థానిక మూడవ రోడ్డులోని ఘంటసాల భవన్‌లో గానకోకిల సుశీల జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నిర్వాహకుడు పాలసముద్రం నాగరాజు నేతృత్వంలో పలు చోట్ల నుంచి విచ్చేసిన గాయనీ గాయకులు ఆ పాత మధురాలతో కళాభిమానులను సమ్మోహితులను చేశారు. ముఖ్యంగా పాత సినిమాల్లో ఘంటసాల, సుశీల పాటలతో అందరూ ఆకట్టుకున్నారు. అనంతరం జిల్లాలో సంగీత సేవలందించే వారిలో ప్రత్యేకంగా ఎంపిక చేసిన సుశీల పురస్కారాన్ని సీనియర్ గాయని శ్రీదేవి, లీల అవార్డును విజయలక్ష్మి, ఎస్.జానకి అవార్డును బృంద, చిత్ర అవార్డును పద్మజకు అందజేసి సత్కరించారు. అదేవిధంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ సేవలందిస్తున్న సంస్కార భారతి లక్ష్మిని సేవా విధూషీమణి పేరిట ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ సినీనటుడు చిత్తూరు నాగయ్య తమ్ముని కుమారుడు ఎల్ఐసీ మధు, ఆరాధన సమితి అధ్యక్షుడు జీవీ రామయ్య, ఆచార్య సుధాకరబాబు, సపారె రాజశేఖర్, భరత్ తదితరులు వారు చేస్తున్న సేవలను కొనియాడారు.

వెళ్లిరా.. కడ్లే గౌరమ్మ



కడ్లే గౌరమ్మను పూల రథంపై ఊరేగిస్తున్న దృశ్యం



కలశాలు తీసుకెళ్తున్న మహిళలు



కళాకారుల నృత్య ప్రదర్శన

రాప్తాడు: మండల కేంద్రంలో ఆదివారం కడ్లే గౌరమ్మ (గౌరీ దేవి) పూల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆడపడుచులు దూర ప్రాంతాల నుంచి శనివారం రాత్రే గ్రామానికి చేరుకుని రాత్రంతా జాగరణ చేశారు. యువతులు, మహిళలు ఇంటి వద్ద నుంచి జ్యోతులు, చక్ర హారతులతో ఆలయానికి వెళ్లి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు మిద్దెల పైకి ఎక్కి పూల రథోత్సవాన్ని తిలకించారు. పూలతో అలంకరించిన రథంలో గౌరీ దేవి విగ్రహంతో పాటు శనగపిండితో తయారుచేసిన కడ్లే గౌరమ్మ ప్రతిమను, మేళ తాళాలు, నంది ధ్వజములు, డోళ్లు, విద్యుత్ దీపాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం 11 గంటలకు గౌరీ దేవిని పండమేరు వంకలో నిమజ్జనం చేశారు. మా గ్రామాన్ని చల్లగా చూడమ్మా అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రథోత్సవాల్లో భక్తులు, కళాకారులు నంది కోళ్లతో అలరించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి, భద్రకాళి దేవి అమ్మవారి వేషంలో భక్తులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ టీవీ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తి, లింగనపల్లి, పుల్లరేవు, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, పర్వతదేవరపల్లి, ముక్తాపురం తదితర గ్రామాల్లోని భారత్ గ్యాస్ వినియోగదారులకు సోమవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 16వ తేదీ వరకూ భారత్, హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు రాప్తాడులోని పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు.